క్లుప్తంగా

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి



కొత్తకోట (ఆత్మకూర్): సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ జరుగుతుందని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. సోమవారం మండలంలోని దేవరపల్లి లో సీసీ కెమెరాల ఆవశ్యతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామస్తులు ముందుకు రావాలని, సొంతంగా డబ్బులను సమకూర్చుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రూ.30 వేలు సమకూర్చి ఎస్‌ఐకు అందజేశారు.

30 ఏళ్లు పైబడిన వారికి మధుమేహ పరీక్షలు

పాన్‌గల్: మండలంలోని గ్రామ, గ్రామాన మధుమేహ (షుగర్) నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. సోమవారం మండలంలోని కేతేపల్లిలో నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 30 ఏళ్లు పైబడిన వారందరూ పరీక్షలు చేయించుకుంటూ వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయితే ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో ఇప్పటి వరకు 972 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడి

కొత్తకోట (ఆత్మకూర్): వ్యవసాయ రంగంలో కాలానికి అనుగుణంగా వచ్చే ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించొచ్చని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తనయుడు అచ్యుత్ రాంరాజ్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మండలంలోని రైతులు, నాయకులతో సమావేశమయ్యారు. డ్రోన్‌ల ద్వార పంటలకు మందు పిచికారీ చేయిస్తే సమయంతో పాటు కూలీల ఖర్చు ఆదా అవుతుందని, అధిక దిగుబడులు సాధించొచ్చని అన్నారు. రైతులు అత్యాధునిక వ్యవసాయానికి అలవాటు పడాలని మార్కెట్లో డ్రోన్స్లు, ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, జుబేర్, గణేష్, దామోదర్, అశోక్, హరీష్‌గౌడ్, శాలం, జమాల్, రఫీ, గద్వాల శ్రీను, జహంగీర్, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యశాల

వనపర్తి: జిల్లా విద్యాశాఖ ఉమ్మడి పరీక్షల విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు స్థానిక ఎమ్మార్సీ భవనంలో ప్రశ్నాపత్రాల రూపకల్పన కార్యశాలను నిర్వహిస్తున్నట్లు డీసీఈబీ జిల్లా కార్యదర్శి ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. రెండో సంగ్రహణాత్మక మదింపు (సమ్మేటివ్ అసెస్మెంట్-2) పరీక్షల నిర్వహణ కోసం ఒకటి నుంచి తొమ్మిదో తరగతుల వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు సీసీఈ పద్ధతిలో ప్రశ్నాపత్రాలు తయారు చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల స్థాయి భేదాలను అనుసరిస్తూ బ్లూ ప్రింట్ అనుసరిస్తూ ప్రశ్నాపత్రాలను తయారు చేయాల్సి ఉంటుందని చంద్రశేఖర్ విషయ నిపుణులకు సూచించారు. కార్యక్రమంలో డీసీఈబీ అసిస్టెంట్ సెక్రెటరీ సురభి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయ విషయ నిపుణులు శాంతన్న, బైరోజు చంద్రశేఖర్, శ్రీనివాస్‌గౌడ్, విష్ణువర్ధన్, విష్ణు, సాబేర్, జ్యోతి, డాక్టర్ బి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రధాని మోదీ ప్రశంసాపత్రం

వనపర్తి: జిల్లా కేంద్రంలోని చాణక్య హై స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి బి.ప్రణయ్‌కుమార్‌కు ప్రధాని నరేంద్రమోడీ నుంచి ప్రశంసాపత్రం పంపింపారని స్కూల్ ప్రిన్సిపాల్ సాజుపాల్ తెలిపారు. గతేడాది దసరా సెలవుల సమయంలో గుజరాత్‌లో ప్రేరణ అనే వ్యాసరచన శిక్షణ కార్యక్రమం వారం రోజులపాటు జరిగింది. కార్యక్రమంలో దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొని శిక్షణ పొందగా.. వనపర్తి జిల్లా నుంచి వెళ్లిన ప్రణయ్‌కుమార్‌కు ప్రశంసాపత్రం రావడంతో ప్రిన్సిపాల్, తోటి విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వీపనగండ్ల: పదో తరగతి, విద్యలో వెనుకబడ్డ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాధికారి నర్సింహులు అన్నారు. సోమవారం మండలంలోని పలు ఉన్నత ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులను ఉత్తీర్ణులయ్యే విధంగా చూడాలని గణితం, ఇంగ్లిష్ తదితర సబ్జెక్టుల్లో అవసరమైన మెలకువలను నేర్పించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. తూంకుంట, నాగర్లబండతండా పాఠశాలలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సీఆర్పీ నాగరాజు, హెచ్‌ఎంలు కిరణ్‌కుమార్‌రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అమరచింత: మండలంలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పరిశీలించారు. పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. తాగునీటితో పాటు విద్యుత్ సౌకర్యం, ప్రహరీ సౌకర్యాల గురించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా అసౌకర్యాలు ఉంటే వాటిని గుర్తించి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని రాజపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ రాఘవ పరిశీలించారు. మౌళిక వసతులు, సౌకర్యాలు గురించి ఆరా తీశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ పరమేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసుగౌడ్, కార్యదర్శి రాఘవేందర్, క్షేత్ర సహాయకుడు నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితా విడుదల చేస్తున్న అధికారులు

23,652 మంది ఓటర్లు

వీపనగండ్ల: మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో 23,652 మంది ఓటర్లు ఉన్నారని, వారికి సంబంధించిన ఓటర్ లిస్టులను సోమవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. 11,887 మంది పురుషులు, 11,764 మంది మహిళా ఓటర్లు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నట్లు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 8 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. 39 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 13, 14 తేదీల్లో రిటర్నింగ్ ఆఫీసర్లతో పాటు ఏఆర్‌ఓ, ఓపీఓలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి యత్నం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- ఇంటి స్థలాలు చూపాలని ఆందోళన
- గుడిసెల పోరు లబ్ధిదారులను అడ్డుకున్న పోలీసులు
- పోలీసులు, సీపీఎం నాయకుల మధ్య తోపులాట
- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హామీతో ఆందోళన విరమణ

అమరచింత: గుడిసెల పోరు లబ్ధిదారులు సోమవారం తలపెట్టిన తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. రెండు రోజుల నుంచి చేపడుతున్న రిలే దీక్షల్లో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఎం నాయకులు తెలపడంతో పోలీసులు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలోకి వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇంటి స్థలాలకు హద్దులు చూపాలంటూ దుంపాయికుంట లబ్ధిదారులు భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, లబ్ధిదారులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి ఎండీ జబ్బార్, మహమూద్, సీఐ శివకుమార్, ఎస్‌ఐ సురేష్ చర్యలను ఖండిస్తూ ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులకు తహసీల్దార్ కార్యాలయం లోపలికి అనుమతి లేదని, కావాలంటే ఐదుగురిని అనుమతిస్తామని పోలీసులు తెలపడంతో బారికేడ్ల వద్ద బైటాయించి వంటావార్పు చేపట్టారు. ఈ క్రమంలో ఆందోళన సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది.

పోలీసుల జులుం..

దుంపాయికుంటలో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు రెండున్నరేళ్లుగా శాంతియుతంగా గుడిసెలు వేసుకుని ఆందోళన చేస్తుంటే కనీసం కన్నెత్తి చూడని పోలీసులు.. నేడు పాలకులు కనుసన్నలో ఉంటూ తమ ఆందోళన అడ్డుకోవడం తగదని ఎండీ జబ్బార్ పోలీసుల తీరును ఎండగట్టారు. కేసులకు భయపడేది లేదని ఇచ్చిన హామీ ప్రకారం ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ న్యాయం చేస్తాం..

దుంపాయికుంటలో ఇంటి పట్టాలు పొందిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హామీ ఇవ్వడంతో గుడిసెల పోరు లబ్ధిదారులు తమ ఆందోళనను విరమించారు. వారం రోజుల వ్యవధిలో దుంపాయికుంటలోని మిగులు ఏడు ఎకరాల పొలాన్ని సర్వే చేయించి, ఇంటి స్థలాలు చూపిస్తామని భరోసా కల్పించారు. ఇందుకు గాను అఖిల పక్షంతో కలిసి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారని, తాను సైతం సభ్యుడిగా ఉంటానని ఎమ్మెల్యే వెల్లడించారు. తహసీల్దార్ రవియాదవ్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు ను పిలిపించి వెంటనే దుంపాయికుంటలోని ముళ్ల పొదలను తొలగించి కంచె ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, వెంకటేష్, ఆర్‌ఎస్.శంకర్, అజయ్, శ్యాంసుందర్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కేశం నాగరాజుగౌడ్, ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వనపర్తి రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకుని కేసు నమోదు చేశామని వనపర్తి పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టుపల్లి నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను తాళ్లచెరువు వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ఆపి పత్రాలు తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు చూపకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించి, యజమాని రంజిత్‌కుమార్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

యువతి అదృశ్యం

వనపర్తి రూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన యువతి ఈ నెల 4 నుంచి కనిపించడం లేదని సోమవారం ఆమె తల్లి కర్రోళ్ల లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. వారి కథనం మేరకు.. వనపర్తి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కీర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ ట్రెనింగ్ పూర్తి చేసి, ఇంట్లో ఉంటుంది. ఈ నెల 4న ఉదయం ఇంటి నుంచి ఆస్పత్రికి పోతున్నా అని చెప్పి బయటికి వచ్చిన ఆమె మళ్లీ ఇంటికి రాలేదు. అప్పటి నుంచి బంధువులు, చుట్టు పక్కల తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో బాధితురాలి తల్లి సోమవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అంబులెన్స్‌లోనే ప్రసవం

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరికి చెందిన నస్రీన్‌బేగం పురిటి నొప్పులతో సోమవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చింది. ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం 108 వాహనాన్ని రప్పించి జిల్లా ఆస్పత్రికి పంపించగా.. మార్గమధ్యలోనే నస్రీన్‌బేగం నొప్పులు అధికం కావడంతో సిబ్బంది అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. మగ పిల్లవాడు పుట్టాడని, తల్లీ, కుమారుడు ఆరోగ్యంగా ఉండడంతో 108 అంబులెన్స్ టెక్నీషియన్ నరేందర్, పైలెట్ రవి, ఆశావర్కర్ పార్వతిని కుటుంబ సభ్యులు అభినందించారు.

టీబీ నిర్మూలన కోసమే వైద్య శిబిరం

వనపర్తి (ఖిల్లాఘనపురం): ప్రతి గ్రామంలో టీబీ వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకే ప్రభుత్వం టీబీ నిర్ధారణ క్యాంపులు నిర్వహిస్తుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని మామిడిమాడలో టీబీ నిర్ధారణ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించిన క్యాంపుల్లో మొత్తం 129 మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. నలుగురికి టీబీ ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన మందులు అందించారు. అనుమానం ఉండి, గ్రామాల్లో ఆశాలు గుర్తించిన వారు ఖచ్చితంగా పీహెచ్‌సీ వచ్చి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్సింహులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

గోపాల్‌పేట: రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని, వెంటనే ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు రైతులకు అనుకూలంగా రాస్తారోకో నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు రుణమాఫీ చేస్తామని, రైతు భరోసా ఇస్తామని మాటిచ్చినా.. అమలు చేయలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాజు, బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతయ్య, చంద్రశేఖర్, శ్రీనివాసులు, కాశీనాథ్, యాదగిరి పాల్గొన్నారు.



పశువైద్య శిబిరాలతో పాడి రైతులకు మేలు

వనపర్తి (ఖిల్లాఘనపురం): ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులుగౌడ్, జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మామిడిమాడ గ్రామాల్లో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిబిరానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం పశువులకు అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ కార్యదర్శి సరోజ, మండల పశువైద్యాధికారి సునన్‌కేసి, అంజనేయులు, మాధవి, సుబ్బారెడ్డి, రాఘవేందర్, నాయకులు వెంకటేశ్వర్‌రావు, సాయిచరణ్‌రెడ్డి, సహాయకులు బద్రీనాథ్, మల్లేష్, నరసింహ, ఖుర్షీద్, అలీ, గోపాల మిత్రులు కుర్మయ్య, నారాయణ, రాజవర్ధన్ రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు 9 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీహరి అన్నారు. కార్మికుల వేతనాలు చెల్లించాలంటూ చేపడుతున్న దీక్షలు సోమవారం 6వ రోజుకు చేరుకున్నాయి. శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులకు జీఓ 60 ప్రకారం రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా.. అందులో కోతలు పెడుతూ కాంట్రాక్టర్ వెంకటయ్య అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ హరినారాయణ, డాక్టర్ నిస్సార్‌అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి మోష, కార్మికులు బాలరాజు, పార్వతమ్మ, నాగమ్మ, సత్తార్, భరత్, మోహినిద్దీన్, చెన్నమ్మ, బాలకిష్టమ్మ, శైలజ, వెంకటేష్, తిరుపతమ్మ, లక్ష్మి, అరుణ్ తదితరులు ఉన్నారు.



వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు

కొత్త మండలాలు ఏర్పాటు చేయాలి

గద్వాల: జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో పెద్ద గ్రామాలను నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని అఖిలపక్షం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో నూతన మండలాల ఏర్పాటుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో మల్దకల్ మండలంలోని బిజ్వారం, ఎల్కూర్, గట్టు మండలంలోని బలిగెర, మాచర్ల, మిట్టదొడ్డి, చాగదోణ, అయిజ మండలంలోని మేడికొండ, టీటీ దొడ్డి, ధరూరు మండలంలోని ఉప్పేరు, రేవులపల్లి, గద్వాల మండలంలో పూడూరు, అనంతపురం, కేటీ దొడ్డి మండలంలో నందిన్నె గ్రామాలను నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని కోరారు. నూతన మండలాలుగా ఏర్పాటు చేసే వరకు ఆయా గ్రామాలకు చెందిన ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా పోరాటం చేయనున్నట్లు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఈనెల 17వ తేదీన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బస్సు మోహన్‌రావు, ప్రభాకర్, కుర్వపల్లయ్య, అచ్చన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగర్‌దొడ్డి వెంకట్రాములు

ఘనంగా భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కొత్తకోట: మండలంలోని కానాయపల్లిలో కొలువైన స్వయంభూ భూలక్ష్మీవేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి, వరలక్ష్మి దంపతులు హాజరై స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు, నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వామన్‌గౌడ్, గుంత మౌనికమల్లేష్, చెన్నకేశవరెడ్డి, గంగు బాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, శ్రీనివాసులు శెట్టి, బాలయ్య, గోకరయ్య, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



భూలక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శ్రీకృష్ణ ఆలయానికి వెండి వస్తువుల వితరణ



వెండి వస్తువులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి

కొత్తకోట: పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని మాజీ శాసన సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి రూ.1.5 కేజీల వెండి వస్తువులు, స్వామివారి ఉత్సవ పంచలోహ విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రావుల చంద్రశేఖర్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరిగే ఆలయ ప్రారంభ వేడుకలకు భక్తులు వేలాదిగా తరలిరావాలని శ్రీకృష్ణ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వామన్‌గౌడ్, పోగాకు సుకేషిని విశ్వేశ్వర్, ముంత సత్యంయాదవ్, తిమ్మన్న, బాలకొండన్న, హనుమంతు యాదవ్, రాములుయాదవ్ పాల్గొన్నారు.

‘కేంద్ర బడ్జెట్‌ను పునఃసమీక్షించాలి’

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన మహాధర్నాకు సోమవారం మండలంలోని రేమద్దుల, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండా నుంచి ప్రజా సంఘాలు, సీపీఎం నాయకులు పలు వాహనాలల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు వచ్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.

మహాధర్నాకు బయలు దేరిన..

వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన మహా ధర్నాకు జిల్లా కేంద్రం నుంచి ప్రజా సంఘాల నాయకులు పుట్టా ఆంజనేయులు, మండ్ల రాజు, గంధం మదన్, సాయిలీల, కృష్ణయ్య, బాలస్వామి, మధు, ఉమ, మహేష్, బీసన్న, రత్నయ్య, మణ్యం బయలుదేరి వెళ్లారు.



వనపర్తి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ప్రజా సంఘాల నాయులు

లక్ష్మీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

వనపర్తి (ఖిల్లాఘనపురం): మండలంలోని గట్టుకాడిపల్లి లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని దర్శించుకున్న ఆయన భక్తులతో కలిసి స్వామివారికి మొక్కులు సమర్పించారు. ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, చిన్న అంజనేయులుగౌడు, బుచ్చిబాబుగౌడు, పెద్ద అంజనేయులుగౌడు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన..

ఖిల్లాఘనపురం మండలంలోని షాపురంతండాలో సోమవారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాన్ని తండావాసులు కనులపండువగా నిర్వహించారు. రెండు రోజులుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన గిరిజనులు శివుడి, గణపతి, సుబ్రమణ్య స్వామి, నవగ్రహ, నంది, నాభిశిల (బొడ్రాయి) ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. అంతకు ముందు ఆలయం వద్ద అభిషేకం, దీక్షాహోమం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రాణప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



షాపురం తండాలో నాభిశిలకు పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

అర్చకుడిపై దాడి హేయమైన చర్య

కొత్తకోట (ఆత్మకూర్): చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని, దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ధూపదీప అర్చక, బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి స్థానిక రాఘవేంద్రస్వామి ఆలయంలో అర్చకులు సమావేశమై.. అర్చకులపై దాడులు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్నికోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంతాచార్యులు, ప్రధానకార్యదర్శి శ్రీధర్‌జ్యోషి, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బాలింగయ్య, ప్రభాకర్‌రావు, వెంకట నర్సింహారావు, భీంసేన్‌జ్యోషి, గుండాచారి, రాఘవేంద్రరావ్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొత్తకోట: పట్టణంలోని భవానీశంకర ఆలయంలో మూడు రోజులుగా ధ్వజస్తంభ, నవగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ పూజలను వేద పండితుడు శ్రీశైల మఠ సారంగధర కోటేశ్వరస్వామి వారి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయ ధర్మకర్తలు బలేల వంశీయులు ఫణిశంకర్, శ్రీధర్, మల్లికార్జున్, విశ్వనాథ్‌ల చేతుల మీదుగా వీరశైవ ఆగమశాస్త్ర ప్రకారం సోమవారం ఉదయం 10.30 గంటలకు ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకోవడంతో భక్తులకు అసౌకర్యం కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులను ఆలయంలోకి అనుమతించారు. ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటి ఆడపడుచులకు వడిబియ్యం, బట్టలు పెట్టడం వంటివి చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యుడు జి.మధుసూదన్‌రెడ్డి, కవిత దంపతులు, మాజీ శాసన సభ్యులు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు గొల్లబాబు, వామన్‌గౌడ్, బీసం చెన్నకేశవరెడ్డి, గుంత మౌనిక, ప్రశాంత్, పాపయ్యగారి కృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రముఖులకు ఆలయ కమిటీ తరఫున పూర్ణకుంభ స్వాగతం పలికి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ధూపం నాగరాజు, హిందూ వాహిని సభ్యులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు